

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024





కూటమి ప్రభుత్వంపై ఆశలు..

గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు సంబంధించిన 11 సంక్షేమ పథకాలను రద్దు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల సీఎం చంద్రబాబు.. గిరిజనశాఖకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. గిరిజనులకు గ్రామాలకు రహదారులు సౌకర్యం, గర్భిణులకు వసతిగృహాలు, ఫీడర్ అంబులెన్స్‌లు, సబ్‌ప్లాన్, ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇవ్వడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధికి దూరంగా గూడ గిరిజన గ్రామం

ఆ ఐదేళ్లూ.. దుర్భరం

- గిరిజనులు దరిచేరని సంక్షేమ పథకాలు, రుణాలు
- సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిన వైసీపీ సర్కారు
- సమస్యలు పట్టించుకునే తీరికలేని అప్పటి పాలకులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చిగురిస్తున్న ఆశలు
- ఇటీవల గిరిజన సంక్షేమంపై సీఎం చంద్రబాబు సమీక్ష

వారు అడవి తల్లి బిడ్డలు. అటవీ ఉత్పత్తులే ప్రధాన జీవనాధారం. ఎంత కష్టమైనా.. చెదరని ఆత్మవిశ్వాసం వారి సొంతం. కాగా.. తరాలు మారుతున్నా.. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. వారి తలరాతలు మాత్రం మారడం లేదు. కనీస రహ దారులు లేక.. సక్రమంగా వైద్యసేవలు అందక.. ఇప్పటికీ ఎన్నో గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఐటీడీఏ సైతం దూరమైన దుస్థితి నెలకొంది. సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లడంతో అభివృద్ధి కనుమరుగైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా.. తమ అభి వృద్ధిపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని గిరిజనం వేడుకుంటోంది. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల జీవన విధానం.. దుర్భర దుస్థితిని తెలుసుకుందాం.

\- మెళియాపుట్టి

● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఆధునిక ప్రపంచంలోనూ గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచు కోవడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏకు సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి.. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి వాటిని వినియోగించేవారు. వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడంతో గత ఐదేళ్లలో గిరిజనులు ఆర్థికాభివృద్ధి మరింత కుంటుపడింది. రాజ్యాంగం నిబంధనల ప్రకారం అటవీ ప్రాంతాల్లో స్థిరనివాసం కలిగిన 33 తెగలు సమూహాలను ఆదివాసీలుగా గుర్తించారు. వీరినే గిరిజనులు, అడవి బిడ్డలుగా పిలుస్తున్నారు. వీరు అటవీ ఉత్పత్తుల విక్రయాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. కాగా.. తరాలు మారు తున్నా.. గిరిజనుల తలరాతలు మారడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 1498 గ్రామాల్లో 39,112 కుటుంబాలకు చెందిన 1,66,118 మంది గిరిజనులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. చాలా గ్రామాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు, కనీసస్థాయిలో వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాకు ఐటీడీఏ లేక..

వైసీపీ ప్రభుత్వం జిల్లాకు ఐటీడీఏ లేకుండా చేసింది. జిల్లా పునర్విభజనలో భాగంగా పాలకొండ నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేసింది. దీంతో పాలకొండ నియోజకవర్గంలోని సీతంపేట ఐటీడీఏ కూడా పార్వతీపురం జిల్లాలో విలీనమైంది. పీవో కార్యకలాపాలు అధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలోనే కొనసాగుతున్నాయి. దీంతో జిల్లాలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు ఐటీడీఏ మంజూరు చేయాలని గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నంలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేసే అవకాశం ఉందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


డోలీపై గర్భిణిని మోసుకెళ్తున్న దబ్బగూడ గిరిజనులు (ఫైల్)

కొనసాగిస్తున్న సంప్రదాయాలు..

గిరిజన పండగలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. గిరిజనోత్పత్తులు లభ్యమయ్యే సీజన్లకు అనుగుణంగా పండగలు గోచరిస్తుంటాయి. కందులు, ఉలవలు, సామలు, ఊదలు, కొర్రలు, గంటెలు, జినుములు, అనపలు ఇలా వివిధ రకాల గిరిజనులు పంటలను వేస్తారు. ఈ పంటలు చేతికందే సమయంలో ఉత్సాహంగా 'కంది కొత్తల' పండగను జరుపుకొంటారు. కొత్తగా పండిన వివిధ రకాల పంటల ఫలసాయాలను వండుకుని తింటారు. సంక్రాంతి సమయంలో ఇటుక పండగను చేసుకుంటారు. ఏ వేడుకైనా ఆదివాసీ మహిళలు థింసా నృత్యాలతో ఆకట్టుకుంటారు. గిరిజనులు డప్పు, డోలు, సొన్నాయి వంటి అనేక వాయిద్య పరికరాలు వినియోగిస్తూ సంబరాలు చేసుకుంటారు. ఆదరణ తగ్గుతున్నా.. సంస్కృతీ సంప్రదాయాలు కొనసాగిస్తుండడం గమనార్హం.

గిరిజన విద్యను వదిలేశారు..

ప్రాథమికస్థాయిలోనే చిన్నారులకు విద్య అందించేందుకు గిరిజన ప్రాంతాల్లో జీపీఎస్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. కాగా.. వైసీపీ పాలనలో విలినం పేరుతో పాఠశాలలు మూతపడడంతో గిరిజనులు విద్యకు దూరమయ్యారు. మెళియాపుట్టి మండలంలోని దిబ్బగూడ, ఎగువ బందపల్లి, బాలేరు, తోపూరు, నాయుడు పోలూరు, గూడ తదితర పాఠశాలలు విలీనం చేశారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం 110 జీపీఎస్ పాఠశాలలు నడుస్తున్నాయి. గత ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో మూడో విడతలో నిధులు కేటాయించి.. పాఠశాలలు అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. కానీ, రెండో విడత పనులే పూర్తికాలేదు. చాలా పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

తాగునీటికి ఇబ్బందులు..

జిల్లాలో కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఊట నీరే తాగుతున్నారు. ఐటీడీఏ పరిధిలో 234 రక్షిత నీటి పథకాలు, 250 వరకు సోలార్ తాగునీటి పథకాలు ఉన్నాయి. 2014లో ఏర్పాటు చేసిన పథకాలు పాడైనా.. మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులతో జల్‌జీవన్ పనులు చేస్తున్నా.. అధికంగా గ్రామాలకు బోర్‌వెల్ లారీలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో పనులు పూర్తికాక గిరిజనులకు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

రహదారులు లేక అవస్థలు..

గిరిజన గ్రామాలకు రహదారులు లేవు. గిరిజన ప్రాంతాల్లో 181 రహదారులకు సుమారు రూ.220 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసినా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయగా.. కొంతమంది వైసీపీ నాయకులకు పనులు అప్పగించారు. వారు పనులు పూర్తిచేయకుండా బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు దర్యాప్తు చేయని పరిస్థితి నెలకొంది.

ట్రైకార్ నిధులు లేవు..

గత ప్రభుత్వం గిరిజనుల కోసం ట్రైకార్ సంస్థను ఏర్పాటు చేసినా.. నిధులు మంజూరు చేయలేదు. రుణాలు అందే పరిస్థితి లేక గిరిజనులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అప్పు తీసుకుని సాగు చేయడంతో మరింత నష్టపోతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ట్రైకార్ రుణాలు మంజూరు చేసేవారు. ఆ డబ్బులతో స్వయం ఉపాధి పొందేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్రైకార్ రుణాల ఊసేలేదు.

తప్పని డోలీమోత..

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. ఇప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో చాలా గ్రామాల్లో డోలీ మోత తప్పడం లేదు. సకాలంలో వైద్యసేవలు అందక మాతా శిశుమరణాలు సంభ విస్తున్నాయి. మెళియాపుట్టి మండలంలో కేరాసింగి, గూడ, చందనగిరి, అడ్డివాడ, డబ్బా గుడ్డి గ్రామాలకు రహదారి లేదు. వాహనాలు వెళ్లలేని దుస్థితి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో డోలీలోనే రోగులను మోసుకుంటూ ఆస్పత్రికి తరలిస్తున్నారు.

● హిరమండలం మండలంలో కిరడివలస, బొంగిగూడ, మర్రిగూడ, సారవకోట మండలంలో అశోకం, బురుజువాడ, గూడ, బొంతుగూడ, కొత్తూరు మండలంలో అద్దంగి, అల్తి, మందస మండలంలో భావనసాయి, గుడ్డి కాలనీ, లలితాపురం, మధుర గుడ్డియాలి, కొండమెర గ్రామాలకు రహదారులు లేక.. డోలీలోనే రోగులను మోసుకెళ్లాల్సి వస్తోంది.


3 కిలోమీటర్లు మేర నడిచి పాఠశాలకు వెళ్తున్న దబ్బగూడ విద్యార్థులు

కనిపించని జీసీసీ సేవలు..

గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధరతోపాటు.. వారికి రుణాలు ఇచ్చి ఆదుకోవాల్సిన జీసీసీ సేవలు కూడా కనుమరుగయ్యాయి. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక గిరిజనులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

నెట్‌వర్క్ లేక అవస్థలు..

గిరిజన గ్రామాలకు నెట్‌వర్క్ లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. పింఛన్లు, రేషన్‌తోపాటు సచివాలయ సేవలు అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 339 గ్రామాలకు సిగ్నల్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెళియాపుట్టి మండలంలో బందపల్లి, బాణాపురం, భరణికోట, కేరాసింగి, వడ్డ, దీనబంధుపురం, జోడూరు, పెద్ద లక్ష్మీపురంలో సిగ్నల్ సమస్య వేధిస్తోంది. చాలా గిరిజన ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఆదివాసీ దినోత్సవం జరపాలి..



జిల్లాలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలి. ఏటా సీతంపేటలో ఈ దినోత్సవం నిర్వహించడం వల్ల జిల్లా గిరిజనులకు ఉపయోగం లేదు. జిల్లా పునర్విభజన తర్వాత సీతంపేట.. పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయడంతో.. అక్కడే రెండు ఐటీడీఏలు కొనసాగుతున్నాయి. జిల్లాకు ఐటీడీఏ లేని పరిస్థితి నెలకొంది. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందని దుస్థితి ఏర్పడింది. నేషనల్ ప్రాజెక్టు పేరుతో గిరిజనులకు అన్యాయం జరుగుతోంది. 47 ఆశ్రమ పాఠశాలకు క్లాస్‌ఫోర్ ఉద్యోగులు లేక విద్యార్థులే వంటలు చేసుకుంటున్నారు.

-యోగి, రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ సంఘం పరిషత్ ఉపాధ్యక్షుడు

సబ్‌ప్లాన్ నిధులు కేటాయించాలి..



గిరిజన గ్రామాల్లో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుచేయాలి. గత ప్రభుత్వం గిరిజనులకు పూర్తిగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. నిరుద్యోగ యువత ఆర్థికాభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందనే నమ్మకం ఉంది. పరిశ్రమల స్థాపనకు చేయూతనివ్వాలి.

-సీహెచ్ శాంతారావు, గిరిజన ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి

శ్రీకాకుళంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

● ఈ నెల 12 నుంచి ఆంక్షలు అమలు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 8: శ్రీకాకుళం నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. ఇరుకైన రహదారులు, వ్యాపార సముదాయాలకు పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు.. ప్రత్యామ్నాయ మార్పులు సూచించారు.

● ఆమదాలవలస - ఆదివారంపేట మీదుగా నగరంలోకి వచ్చే ఆటోలు.. బలగ రిమ్స్ ఆస్పత్రి జంక్షన్ వద్ద కుడివైపునకు టర్న్ తీసుకోవాలి. రిమ్స్ ఆస్పత్రి, శాంతినగర్ కాలనీ, ఆర్ట్స్ కాలేజీ మీదుగా అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకోవాలి.

● ఆటోలు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపునకు నియంత్రించడం వల్ల.. నిత్యం రద్దీగా ఉండే జడ్జి బంగ్లా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్ తగ్గుతుంది. ప్రమాదాలను నియంత్రణ సాధ్యపడుతుంది.

● శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ప్రైవేటు ట్రావెల్ బస్సులు బలగ-ఆదివారంపేట మీదుగా కొత్తరోడ్డు వద్దకు చేరుకుని వెళ్లాలి. దీని వల్ల సాయంత్రం సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్, డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ సులభతరమవుతుంది.

● సింహద్వారం - కిమ్స్ ఆస్పత్రి మీదుగా పట్టణంలో ఆర్ట్స్ కాలేజీ వైపు వెళ్లే వాహనదారులు.. సింధూర ఆస్పత్రి జంక్షన్ వద్ద టర్న్ తీసుకుని.. కాలేజీ రోడ్డుకు చేరుకోవాలి. దీనిని వన్‌వే రోడ్డుగా నిర్ధారించారు. ఈ నెల 12 నుంచి ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి వస్తాయని, ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

'దిశ' డీఎస్పీ ఒంగోలుకు బదిలీ

శ్రీకాకుళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం 'దిశ' పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావును ఒంగోలుకు బదిలీ చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో విజయనగరం జిల్లాలో విధులు నిర్వహించారు. వైసీపీ హయాంలో ఈయనను అప్రాధాన్య పోస్టుకే పరిమితం చేశారు. అప్పట్లో కొంత ఇబ్బందులకు కూడా గురిచేసినట్లు సమాచారం. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం ఈయనను ఒంగోలు ఎస్‌డీపీవోగా నియమించింది. శ్రీకాకుళంలో ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.

అది రోడ్డే..

● 14 ఏళ్ల పోరాటంపై పలాస కోర్టు తీర్పు
● 'మునిసిపాలిటీ'కి ఊరట

పలాస, ఆగస్టు 8: కాశీబుగ్గ గాంధీనగర్‌లో ఆక్రమణలో ఉన్న భూమి.. రహదారేనని పలాస కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. 14 ఏళ్లుగా మునిసిపల్ అధికారులు చేస్తున్న పోరాటానికి ఊరట లభించింది. 40 అడుగుల వెడల్పుగా ఉన్న ఈ రహదారిలో కేటీ రోడ్డు వైపు 2వేల చదరపు అడుగుల స్థలం తమదని, తమకు వారసత్వంగా సంక్రమించిందని ఓ వ్యాపారి షాపులు పెట్టారు. కాగా.. ఇక్కడ గృహాలు, వ్యాపార సంస్థలకు చెందిన రికార్డులన్నీ రోడ్డుగా చూపిస్తున్నాయి. దీంతో మునిసిపల్ అధికారులు వివాదంలో ఉన్న భూమిని ఎటువంటి అభివృద్ధి చేయలేకపోయారు. ఇది రోడ్డు మార్గమని, దీన్ని తాము మునిసిపాలిటీకి లిఖితపూర్వకంగా ఇచ్చామని వ్యాపారవేత్త పెంట ఉదయ్‌శంకర్ విలేకరులకు తెలిపారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆస్తి అని స్పష్టం చేశారు. ఈ క్రమంలో 2010 సంవత్సరం నుంచి ఈ భూ వివాదంపై మునిసిపల్ అధికారులు, వ్యాపారి మధ్య కోర్టు వివాదం నడుస్తోంది. గురువారం తుది తీర్పు వెలువడింది. అది రహదారిగానే పరిగణించాలని కోర్టు ఆదేశించింది. దీంతో మొత్తం రోడ్డు అభివృద్ధి చేయడానికి మార్గం సుగమమయింది. ఈ విషయమై పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ వద్ద ప్రస్తావించగా.. కోర్టు తీర్పు మునిసిపాలిటీకి అనుకూలంగా వచ్చిందన్నారు. దీనిపై ఇంకా న్యాయపరమైన చిక్కులు ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు న్యాయవాదులు చర్యలు తీసుకుంటారని, త్వరలోనే దీనికి మోక్షం లభిస్తుందని తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

● కొన్నిచోట్ల వాయిదా..
● ప్రలోభాలకు వైసీపీ నేతల యత్నం


కాశీబుగ్గ : పెంటవీధిలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని తల్లిదండ్రుల నిరసన

శ్రీకాకుళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు అత్యధిక శాతం ప్రశాంతంగా సాగినా.. కొన్నిచోట్ల అనివార్యమై వాయిదా పడ్డాయి. కొన్నిచోట్ల ఈ ఎన్నికల్లో పట్టు చూపించుకునేందుకు వైసీపీ నాయకులు ప్రలోభాలకు దిగారు. కానీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. కానీ అనివార్య కారణాలతో పలుచోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం ఈదులవలసలో రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొని.. ఎన్నికలను వాయిదావేశారు. కోటబొమ్మాళి మండలం దంత, పలాసలో కాశీబుగ్గ పెంటవీధి స్కూల్, కవిటి మండలం బొరివంక, నందిగాం మండలం కణితివూరు, పెద్ద బాణాపురం పాఠశాలలో ఎన్నికలు వాయిదా వేశారు. కొన్ని కోరం లేక.. మరికొన్ని కృత్రిమ ఆటంకాలతో వాయిదా వేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి చెందిన సానుభూతిపరులే ఆధిక్యం సాధించారు.

వరదొస్తే.. వణుకే

● కోతకు గురవుతున్న తీరప్రాంత భూములు
● పూర్తికాని కరకట్టల నిర్మాణాలు

(సరుబుజ్జిలి)

వర్షం కురిస్తే చాలు.. వంశధార, నాగావళి తీర ప్రాంత వాసులకు కంటిమీద కునుకు కరువవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి ఏ క్షణాన వరదనీరు ముంచుకొస్తుందోనన్న భయం వెంటాడుతోంది. కరకట్టల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఏటా తీరప్రాంత భూములు కోతకు గురవుతున్నాయి. దీంతో ఇళ్లు, పంట పొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లుతోంది. నదులకు వరద పోటెత్తితే.. సరుబుజ్జిలి మండలం పెద్దమాలపేట గ్రామం సుమారు నాలుగు రోజులు జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. అలాగే అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, యరగాం, కాగితాపల్లి, పెద్ద సవలాపురం, చినవెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్ సాహెబ్‌పేట గ్రామాలు నష్టాలకు గురవుతున్నాయి. ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ, కొరపాం, బెలమాం, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం, పొందూరు మండలం సింగూరు, బొడ్డేపల్లి, బూర్జమండలం ఖండ్యాం, గుత్తావల్లి, నారాయణపురం గ్రామాలు నష్టాలు చవిచూస్తున్నాయి. వరదల సమయంలో తీరప్రాంతాల్లో ఉన్న జిరాయితీ భూములు కోతకు గురై నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. మిగిలిన భూములు ఇసుక మేటలలో కప్పేస్తున్నాయి. దీనివల్ల ఇసుకమేటలు తొలగించలేక, సాగుచేయలేక రైతులు అవస్థలు పడుతున్నారు. వైసీపీ పాలనలో కనీసం రాతికట్ట గ్రోయిన్స్ కూడా నిర్మించకపోవడంతో విలువైన ఇళ్లు, భూములు కోల్పోతున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, జిల్లా తెలుగు యువత నాయకుడు గురువు తిరుమలరావు, తదితరులు వాపోతున్నారు. కరకట్టల పనులు పూర్తిచేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కరకట్టల నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.


వరదల సమయంలో మాలపేటలో దుస్థితి (ఫైల్)


పురుషోత్తపురం వద్ద కోతకు గురైన వంశధార నది గట్టు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శ్రీకాకుళం • శుక్రవారం • 9 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

ఒకప్పుడు అడవులను రక్షించే పాత్రల్లో హీరోలు ఇప్పుడు అటవీ సంపద దోచుకోవడమే హీరోయిజం



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- అల్లు అర్జున్‌ను ఉద్దేశించేనా?

ఒకప్పుడు అడవులను రక్షించే కథాంశాలతో వచ్చిన సినిమాలలో హీరోలు నటించేవారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు ఉదాహరణగా కన్నడ సినిమా 'గంధదగుడి' చిత్రాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ ఈనాడు అటవీ సంపదను దోచుకోవడమే హీరోయిజంగా సినిమాలు వస్తున్నాయని ఆయన విచారం వ్యక్తంచేశారు. రీల్‌కు, రియాలిటీకి తేడా ఉంటుందన్నారు. పుష్ప సినిమాలో అడవుల్లోని ఎర్రచందనం కొల్లగొట్టే పాత్రలో హీరో అల్లు అర్జున్ నటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను ఉద్దేశించే పవన్‌కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారా అంటూ ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మానవత్వం చూపాల్సిన తరుణం ఇది

ఇటీవల కురిసిన భారీ వర్షాలు కేరళలోని వయనాడ్‌లో విషాదాన్ని మిగిల్చాయి. కొండ చరియలు విరిగి పడడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి సినీ ప్రముఖులు ముందుకు వచ్చారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం కేరళ వెళ్లి నేరుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి విరాళం చెక్కును అందజేశారు చిరంజీవి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మానవత్వం చూపాల్సిన తరుణం ఇది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతుగా కేరళకు సాయం అందించాలి. ఈ దుర్ఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి' అని కోరారు.





నాగచైతన్య శోభిత నిశ్చితార్థం

టాలీవుడ్ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. కొన్నాళ్లుగా వినిపిస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ కథానాయిక శోభితా దూళిపాళ్లతో ఆయన ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం ఉదయం హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇరువైపులా కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం ఫొటోలను నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసి, కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరారు. 'ఈ రోజు ఉదయం మా అబ్బాయి నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. ఈ మధుర క్షణాలను మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. చాలా సంతోషంగా శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాం. మీ ఇద్దరూ ప్రేమ, సంతోషంతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను' అని నాగార్జున పేర్కొన్నారు. నిశ్చితార్థ వేడుకలో శోభిత ఉప్పాడ పట్టు చీర ధరించగా, నాగచైతన్య పంచెకట్టు, పైన కండువా ధరించి సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. పలువురు సినీ ప్రముఖులు నాగచైతన్య, శోభితకు అభినందనలు తెలిపారు. మరికొద్ది రోజుల్లో వీరి వివాహం జరగనుంది. సమంతతో విడాకులు తీసుకున్నాక నాగచైతన్య శోభితతో ప్రేమలో పడ్డారనీ, ఇద్దరూ తరచూ కలుసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. పలు సందర్భాల్లో నాగచైతన్య, శోభితా జంటగా కనిపించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. కానీ నిశ్చితార్థం వరకూ వారు ఎక్కడా దీనిపై స్పందించలేదు. నాగచైతన్య, శోభిత కలసి ఒక్క సినిమా కూడా చేయలేదు. స్నేహితుల ద్వారా ఇద్దరికీ పరిచయం అయ్యి అది ప్రేమగా మారిందని సమాచారం. చూసేందుకు ఇంటర్నేషనల్ మోడల్‌లా కనిపించే శోభిత తెలుగమ్మాయే. తెనాలిలో జన్మించారు. కొన్నాళ్లు కుటుంబంతో విశాఖలో ఉన్నారు. ముంబైలో ఉన్నత విద్యను అభ్యసించారు. మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టారు. 2013 ఫెమీనా మిస్ ఇండియా ఎర్త్ టైటిల్ గెలుచుకున్నారు. 2016లో వచ్చిన బాలీవుడ్ చిత్రం 'రామన్ రాఘవన్'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగులో 'గూఢచారి, మేజర్' చిత్రాల్లో నటించారు.

నాడు ప్రేమ ప్రకటన

'ఏ మాయ చేశావే' చిత్రంలో జంటగా నటించిన నాగచైతన్య, సమంత ఏడేళ్ల డేటింగ్ తర్వాత 2017లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2021లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 8న నాగచైతన్యకు తన ప్రేమ ప్రతిపాదన చేశానని సమంత ఓ సందర్భంలో చెప్పారనీ, ఇప్పుడు అదే తేదీన నాగచైతన్య శోభితల నిశ్చితార్థం జరగడం కాకతాళీయమేనా, కావాలనే అలా చేశారా? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. శోభిత హిందీలో 'సితార' చిత్రం చేస్తున్నారు.

ముందస్తు బెయిల్



నటుడు రాజ్‌తరుణ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రాజ్‌తరుణ్ తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ ఫిర్యాదుపై అతనిపై నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. రాజ్‌తరుణ్ రెండు వారాల్లో నార్సింగ్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, రూ.20 వేల బాండు, రెండు పూచీకత్తులు ఇవ్వాలని జస్టిస్ శ్రీదేవి ధర్మాసనం ఆదేశించింది. 8 వారాల పాటు ప్రతి శనివారం పిటిషనర్ పోలీసుల ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. మరోవైపు రాజ్‌తరుణ్ స్నేహితుడు శేఖర్ బాషాతో తనకు ప్రాణహాని ఉందని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెట్స్‌లోకి...



పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆఖరి దశ షూటింగ్‌లో ఉన్న ఈ సినిమా సెట్స్‌లోకి బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానిస్తూ చిత్ర బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. "పవన్, అనుపమ్ ఖేర్ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా ఉండనున్నాయి. అభిమానులకి జీవితాంతం గుర్తుండిపోయే సినిమా ఇది" అని మేకర్స్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

షెకావత్ సాబ్



అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప 2' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్‌లో హీరోతో పాటు కీలక పాత్రలు పోషిస్తున్న ఆర్టిస్టులు పాల్గొనగా పతాక సన్నివేశాలు తీస్తున్నారు. బన్వర్‌సింగ్ షెకావత్‌గా నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ లుక్ పోస్టర్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా గురువారం విడుదల చేశారు. గళ్ల లుంగీ, ఒక చేతిలో గన్, మరో చేతిలో గొడ్డలితో ఫహాద్ కనిపిస్తున్నారు. డిసెంబర్ 6న 'పుష్ప 2' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మిస్తున్నారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది



'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో నిహారిక కొణిదెల నిర్మాతగా మారారు. యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిహారిక మీడియాతో ముచ్చటించారు. "కథ విన్న వెంటనే ఈ సినిమాలో భాగం అవ్వాలనుకున్నాను. ఒక ఊరిలో జాతర నేపథ్యంలో మూడు తరాలకు చెందిన కథగా దర్శకుడు తెరకెక్కించారు. అందరికీ సినిమా విపరీతంగా నచ్చుతుంది. ఇందులో ఎన్నో క్యారెక్టర్లు ఉన్నా.. ప్రతీ పాత్రకూ విలువ ఉంటుంది. ప్రేక్షకులు ఏదో ఒక పాత్రతో కచ్చితంగా ట్రావెల్ అవుతారు. ఒక నిర్మాతగా ఈ సినిమా నాకెంతో సంతృప్తినిచ్చింది" అని చెప్పారు.


జలుమూరు (సారవకోట): మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి


కవిటి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


నరసన్నపేట: మాట్లాడుతున్న కృష్ణమోహన్

పంచాయతీల అభివృద్ధికి తోడ్పడండి

- నిధులు, విధులపై అవగాహన
- సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా మాస్టర్‌ట్రైనీలు పంచాయతీల నిధులు, విధులు వినియోగం, పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

నిధులు సద్వినియోగం చేసుకోండి: కృష్ణమోహన్

నరసన్న పేట:గ్రామాలు అభివృద్ధికి సర్పంచ్‌లు ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగంచేసుకోవాలని సెర్ప్‌పరిశీలకుడు, పీఆర్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ సర్పంచ్‌లకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

●**పోలాకి:**పంచాయతీలను అభివృద్ధిపదంలో నడిపించాలని పీఆర్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ కోరారు.పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం వాటి ప్రాధాన్యం అంశాలను తెలుసుకోవాలన్నారు. శిక్షణ తరగతుల పనితీరు, రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఎంపీడీవో ఉషశ్రీ, డీపీఆర్‌సీ ఎస్.లోకనాథం, పంచాయతీ అధికారి పద్మావతి, సూపరింటెండెంట్ బలగప్రకాష్ పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతికి ప్రణాళికల అవసరం: సీఈవో

నందిగాం: పంచాయతీల ప్రగతికి ప్రణాళికల అవసరమని జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. నందిగాంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు సీఈవోకు గ్రీన్‌అంబాసిడర్ల వేతనాలు పంచాయతీల నుంచి కాకుండా ప్రభుత్వంచెల్లించేలా చూడాలని, ఏకగ్రీవ పంచాయతీలకు ప్రకటించిన పారితోషికం విడుదల చేయాలని, పూర్తి స్థాయిలో కార్యదర్శులను నియమించాలని కోరారు. ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో మాస్టర్‌ట్రైనీలుగా కె.సంతోష్‌కుమార్, సీహెచ్ ఢిల్లేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ఉప సీఈవో వెంకటరామన్, మండల స్వచ్ఛ్ కన్వీనర్ ఎ.రాంబాబు పాల్గొన్నారు.

శిక్షణ బహిష్కరణ

● **కోటబొమ్మాళి:**వ్యాధులు ప్రబలకుండా చర్యలుచేపట్టాలని జడ్పీ సీఈవో బి.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు. కాగా సర్పంచ్‌లు తమకు ఎటువంటి బాధ్యతలు లేకపోతే ఇటువంటి శిక్షణలకు ఎందుకని బహిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీసీఈవో ఆర్.వెంకటరమణ్, ఈవోపీఆర్‌డీ బి.రామారావు,ఎన్. చైతన్య, పి. రుణీష పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి సర్పంచ్‌లు పాటుపడాలి: బగ్గు

జలుమూరు (సారవకోట): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు సర్పంచ్‌లు పాటుపడాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు నిచ్చారు. సారవకోట మండల పరిషత్ సమావేశ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, పీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు: అశోక్

కవిటి:పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ నిర్వహించారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. అందరికీ అందుబాటులోనున్న పాలనను దారి తప్పించి నిధులు మళ్లించి సర్వనాశనం చేసిందన్నారు. పేరుకే పదవులున్నా గ్రామస్థాయిలో ఏ విధమైన పనులు చేసుకోలేని స్థితిలో సర్పంచ్‌లను మార్చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

● **టెక్కలి:**పంచాయతీ నిధులు, వాటి వినియోగంపై అవగాహన తప్పనిసరి అని ఎంపీడీవో కె.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్కలి మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకుశిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు హెచ్‌వీ రమణమూర్తి, ఈవోపీఆర్‌డీ పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

●**పాతపట్నం:** ప్రాధాన్యతాక్రమంలో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీవో కె.రామకృష్ణరాజు కోరారు. పాతపట్నం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు.ఈవోపీఆర్‌డీ టి.కృష్ణారావు పాల్గొన్నారు.

● **పలాస రూరల్:** పారిశుధ్య నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ తెలిపారు. పలాసలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** స్థానిక ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, ఈవోపీఆర్డీ, సెక్రటరీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

●**లావేరు:** గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శుల పాత్ర కీలకమని ఈవోపీఆర్డీ విశ్వేశ్వరరావు తెలిపారు.మండల పరిషరిత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యాదర్శులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కొండలరావు, రీసోర్సు పర్సన్స్‌గా రవికుమార్, శ్రీను, శ్రీనివాస్, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు పాల్గొన్నారు.

● **గార:** శిక్షణను సద్వినియోగం చేసుకుని పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించాలని డీపీవో కె.వెంకటవేశ్వరరావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఎంపీడీవో బి.కల్యాణి, ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ రాము, రీసోర్సు పర్సన్ చెట్టు శంకరరావు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** ప్రణాళికతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎన్ఐఆర్‌డీ పరిశీలకులు కె.నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ పి.వెంకట రాజు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, ఈవోపీఆర్డీ గోవిందరావు, రిసోర్స్‌పర్సన్ బి.నాగరాజు, బి.స్టాలిన్, వి.విక్రమ్, పి.రాము, టి.అభిలాష్ పాల్గొన్నారు.

● **సరుబుజ్జిలి:** మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తొలి రోజు గురువారం తూతూ మంత్రంగా సాగింది. శిక్షణకు ముఖ్య అధికారులు హాజరు కాలేదు. ఆరుగురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. మిగిలనవారు డుమ్మా కొట్టారు.

●**రణస్థలం:** సీజన్ వ్యాధులపై సర్పంచ్‌లు, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శలకు విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు.

●**ఎల్.ఎన్. పేట:**పంచాయతీల్లో మౌలికసదుపాయాలకు ప్రాధాన్యతనివ్వాలని ఎంపీడీవో జి.గిరిబాల తెలిపారు. ఎల్ఎన్‌పేటలో కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఐ. పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి హైమావతి పాల్గొన్నారు.


గార: మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు


కోటబొమ్మాళి: మాట్లాడుతున్న సీఈవో వెంకటేశ్వరరావు


పలాస రూరల్: మాట్లాడుతున్న ఐవీ రమణ


అరసవల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండు శంకర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం: మండలం మదనాపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందని ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులతో పాటు చెట్టుకొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మదనాపురం, దీనబంధుపురం, దిమ్మిడిజోల, కల్లాడ, నౌగాం, హర్షబాడ, భర్తుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

●**మెళియాపుట్టి:**మండలంలోని గొప్పిలి సబ్‌స్టేషన్‌పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శంఖరావు తెలిపారు.

●**సంతబొమ్మాళి:**సంతబొమ్మాళి, బోరుభద్ర, నౌపడ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎం.శివకుమార్ తెలిపారు. చెట్లపై కొమ్మలు తొలగించనుండడంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

●**వజ్రపుకొత్తూరు:** మండలంలోని బెండి, మోటూరు ఫీడర్ పరిధి లోగల రోడ్డుకు ఇరువైపుల చెట్లు కొమ్మలు తొలగిస్తుండడంతో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ ఎస్ఎన్ కృష్ణమూర్తి తెలిపారు.

12న చీపిలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

హరిపురం/మందస:మందస మండలం చీపిలో ఈనెల 12న ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్ భాస్కరరావు మృతి

కోటబొమ్మాళి: మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్, దంత ప్రాదేశికం ఎంపీటీసీ మెండ భాస్కరరావు గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య ప్రశాంతి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయన మృతి పట్ల కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, విజయలక్ష్మి, దేశం నేతలు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, కర్రి అప్పారావు, నం బాళ శ్రీనివాసరావు, పట్ట సింహాచలం, శిమ్మ నారాయణరావు, నక్క కృష్ణారావు, చల్ల సింహాచలం, మండవిల్లి మోహనరావు సంతాపం తెలియజేశారు.

కేరళ బాధితులకు రూ.లక్ష విరాళం

సంతబొమ్మాళి: కేరళలోని వయనాడ్ బాధితులకు తన వంతుగా రూ. లక్ష విరాళాన్ని గురువారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు టెక్కలి నియోజకవర్గ జై భారత్ నేషనల్ పార్టీ ఇన్‌చార్జి బైపల్లి పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో అందరూ మానవతా దృక్పథంలో బాధితులను ఆదుకోవాలని కోరారు.

లబ్బలో న్యాయ విజ్ఞాన సదస్సు

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామంలో న్యాయాధికారి రాణి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, న్యాయవాది ఫల్గుణరావు, కొత్తూరు కోర్టు ఏజీపీ రాద్రాజు, మెట్టూరు పీహెచ్‌సీ వైద్యులు కర్నేన రాంబాబు, నడిమింటి తేజ శ్రీ పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులను నియమించాలి

కాశీబుగ్గ:శానిటేషన్ కార్మికులను నియమించాలని మునిసిపల్‌వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు బలరాం, సీఐటీయూ నాయకులు గణపతి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలోమునిసిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు.అనంతరం కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గణపతి, సలహాదారుడిగా మురుగన్, అధ్యక్షకార్యదర్శులుగా వెంకట్, కూర్మారావును ఎన్నుకున్నారు.

కంటిపరీక్షలు

మందస: మండలంలో జీటీడబ్ల్యుహెచ్ పాఠశాలలో అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలోగురువారం 125 మంది విద్యార్థులకు అప్తాల్మిక్ రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి దృష్టిలోపం ఉండడంతో వారికి కంటి అద్దాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఆలయ ఆస్తుల పరిశీలన


ఆలయ ఆస్తులను పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలి: టెక్కలిలోని దేవదాయ, ధర్మాదాయశాఖ పరిధిలో గల ఆలయ ఆస్తులను గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. శ్యామసుందరస్వామికి సంబంధించిన 531/18, 535/1. 538/1, 540/3, 552/1 ప్రాంతాల్లో గల సుమారు రెండున్నర ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు సర్వేనిర్వహించారు. దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు పద్మనాభపండా, రెవెన్యూ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి


హిరమండలం: రోగులతో మాట్లాడుతున్న పీవో

జలుమూరు:విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలని ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నవరబొంతు ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్స్ పోటీల్లో పతకాలు పొందిన భారత క్రీడాకారులు వీడియోలను విద్యార్థులకు చూపించి ఉత్సాహపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలి: పీవో

హిరమండలం: పీహెచ్‌సీల్లో ప్రసవాలను పెంచాలని సీతంపేట ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్ కోరారు. గ మండలంలోని చొర్లంగి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు.

రక్తహీనతను అధిగమించాలి

జలుమూరు: గర్భిణులు ప్రోటీన్లు, ఐరన్ పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకొని రక్తహీనతను అధిగమించాలని అదనపు జిల్లా వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ తెలిపారు. అచ్యుతాపురం పీహెచ్‌సీలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.సుజాత, ప్రసన్నలక్ష్మి, డీపీఎంవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


సీమంతాల్లో పాల్గొన్న గర్భిణులు

నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేయండి

- క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఇంజనీరింగ్ సిబ్బందికి సూచన

నరసన్న పేట: నిర్మాణాల్లో పూర్తిస్థాయిలో నాణ్యత లేకపోతే బిల్లులు చెల్లింపులు నిలుపుదల చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి క్వాలిటీ కంట్రోల్ సూచించారు. గురువారం జమ్ము, కోమర్తి, యారబాడు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే, ఆరోగ్యవికాస కేంద్రాల నిర్మాణాలను పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎంవీ శేఖర్ ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. గత ప్రభుత్వ హయంలో గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం ఆదేశాలతో క్వాసీ అధికారులు తనిఖీచేస్తున్నారు. భవనాలు నిర్మాణాలతో పాటు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర పనులు పరిశీలించారు. భవనాలపై వర్షంనీరు నిల్వ లేకుండా ఏర్పాట్లు చేయాలని ఏఈలకు సూచించారు. కారక్రమంలో డీఈఈ సత్యంనాయుడు, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ శామ్యూల్, ఏఈ పి.గోవిందరావు, పీఆర్ ఏఈ మోహన్, అచ్యుతరావు, శివకుమార్ పాల్గొన్నారు.


జమ్ము గ్రామ సచివాలయ భవనం పైభాగాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ ఎంవీ శేఖర్, క్యూసీ అధికారులు

పలాసలో గోల్డెన్‌జూబ్లీ సంబరాలు


కేకు కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస:స్థానిక టీడీపీకార్యాలయంలో సినీహీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ ప్రస్థానంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం రాత్రి గోల్డెన్‌జూబ్లీ సంబరాలు అభిమానులు, టీడీపీ నాయకులు నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులమీదుగా కేక్ కటింగ్ చేశారు.అనంతరం బాలకృష్ణ అభిమానులు శిరీషకు సత్కరించారు. కార్యక్రమంలో అభిమానులు జి.వాసు, టి.బాబూరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు ఘనసన్మానం

వజ్రపుకొత్తూరు:హుండిలో గురువారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగాహుండి గోవిందపురం రావడంతో సన్మానించినట్లు నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు పుచ్చ శోభారాణి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ని రమణ దంపతలు, పుచ్చ ఈశ్వరరావు, మదనాల జోగారావు, వంక రామారావు పాల్గొన్నారు.

శివసాగర్‌తీరం పరిశీలన

వజ్రపుకొత్తూరు: శివసాగర్‌తీరంలో పాటు ఇతర బీచ్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ రామారావు పేర్కొన్నారు. గురువారం శివసాగర్‌తీరంలో సిబ్బందితో కలిసి పరిశీలించి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బైపల్లి యువత చాణిక్య, శివ, పాపారావు, ఏఎస్ఐ జున్నారావు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ

జలుమూరు: మండలంలోని పెద్దదూగాంలో పాతపట్నం అమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గ్రామ పురోహితులు మావుడూరి జగదీష్ శర్మ నేతృత్వంలో గురువారం నిర్వహించారు.తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం, చేపట్టి అమ్మవారి విగ్రహానికి ధాన్యాధివాసం, జలాధివాసం కార్య క్రమం చేపట్టారు.

పాఠశాలల్లో ఆటల పోటీలు

పోలాకి: సుసరాం జడ్పీ ఉన్నత పాఠశాల,పోలాకి, దీరాశి, ఈదులవలస, కోడూరు, ప్రియాగ్రహారం, గొల్లలవలస, బొద్దాం, కుసుమపోలవలస, గుప్పెడుపేట, గంగివలస కేజీబీవీ, పోలాకి బాలికోన్నత పాఠశాలల్లో స్వాతం త్ర్య దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆట,పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు చెప్పారు.

●**పలాసరూరల్:** బొడ్డపాడులో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ నిర్వహించినట్లు పీడీ రాంజీ తెలిపారు.

పొలంబడితో నాణ్యమైన ఆహారోత్పత్తులు


పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ మధు

హరిపురం: పొలంబడి కార్యక్రమంతో రైతులు పురుగుమందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహారోత్పత్తులు సాధించవచ్చని పలాస వ్యవసాయ శాఖ ఏడీఏ ఎల్.మధు తెలిపారు. గురువారం మందస మండలం జిల్లుండలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాశాఖ అధికారులతో పాటు శిష్టు బాబ్జి, ప్రసాద్, బెన్న కామేశ్వరరావు, పీరుకట్ల దేవేంద్ర, పల్లి చంద్రశేఖర్, మోహనరావు పాల్గొన్నారు.

కోరం రాక.. విద్యార్థులు లేక

- పలుచోట్ల ఎన్నికల వాయిదా
- స్వల్ప వాగ్వాదాలు.. పోలీసుల జోక్యం
- జిల్లాలో ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

జిల్లాలో గురువారం అక్కడక్కడ చదురుమదురు ఘ టన తప్ప పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కొన్ని చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదాపడ్డాయి. మరికొన్ని చోట్ల విద్యార్థులు లేకపోవ డంతో ఆయా పాఠశాలల్లో ఎన్నికలను రద్దుచేశారు. పలు చోట్ల టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య స్వల వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవల్సివచ్చింది. కాగా కూటమి మద్దతు దారులే ఎక్కువ చోట్ల విజేతలుగా నిలిచారు.

● **పోలాకి:** మండలంలోని 96 ప్రభుత్వ పాఠశాలలకు గాను గురువారం 93 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈదులవలస మోడల్ స్కూల్, చెల్లాయివలస పంచాయతీ కోరాడలచ్చయ్యపేట, కొత్తరేవు పంచాయతీ అ క్కువరం పాఠశాలల్లో ఎన్నికలు జరిగలేదని ఎంఈవోలు శ్రీనివాస నాయక్, లింగరాజు తెలిపారు. ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఎన్నికలు ప్రారంభంకాక ముందే వైసీపీ, టీడీపీ వర్గీయులు వాగ్వాదానికి దిగగా పోలీసులు ఇరువర్గాలు పంపించేశారు. ఈదులవలసలో కోరంలేక ఎన్నిక వాయిదా వేసినట్టు పాఠ శాల ఇన్‌చార్జి శ్రీరామమూర్తి చెప్పారు. కోరాడ లచ్చయ్య పేటలో కోరంలేక, అక్కువరంలో విద్యార్థులు లేక ఎన్నిక లు వాయిదా పడినట్టు అధికారులు తెలిపారు.

● **నరసన్నపేట:** మండలంలోని 83 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 82 చోట్ల ఎ స్ఎంసీ ఎన్నికలు జరిగాయి. నరసన్నపేట లోని న్యూ స్కూల్‌లో విద్యార్థులు లేక ఎన్నిక నిర్వహించలేదు. బాడాం ఉన్నత పాఠశాల వద్ద స్వల్ప వి వాదం చోటు చేసుకోవడంతో ఎస్ఐ అశోక్‌బాబు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

● **పలాస:** పలాస ప్రభుత్వ ఉన్నతపాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా కోట తారక్ ఎన్నికయ్యారు. వైస్‌ఛైర్మన్‌గా జ్యోతిపా త్రో, 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.దాశరధి, టి.చిట్టిబాబు, జోగ మల్లి, మల్లా భద్రయ్య, టంకాల రవిశంకర్‌గుప్తా, నాగభూషణగుప్తా పాల్గొన్నారు. సూదికొండ పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్‌గా పైల తులసి, వైస్‌ఛైర్మన్‌గా బలగ శ్రావణి ఎంపికయ్యారు.

● **కాశీబుగ్గ:** కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల ఛైర్మన్‌గా గొజ్జ రాధ, వైస్ ఛైర్మన్‌గా పెద్ది శ్రీనివాస్‌రావును ఎన్నుకున్నారు.

● **సంతబొమ్మాళి:** మండలంలో 104 పాఠశాలలు ఉండగా 103 చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని ఎంఈవో జలుమూరు చిన్నవాడు తెలిపారు. గెద్దలపాడు యూపీ పాఠశాలలో ఎన్నిక వాయిదా పడిందని చెప్పారు. కాగా పాలతలగాం యూపీ పాఠశాలలో అందరూ మహిళ సభ్యులను ఎన్నుకోవడం విశేషం. ఏడు తరగతులకు గాను తరగతికి ముగ్గురు చొప్పున్న 21 మంది మహిళ ప్రతినిధులను ఎన్నుకున్నారు.

● **మెళియాపుట్టి:** పెద్దమడిలో వైసీపీ, టీడీపీ మద్దతుదారులకు ఓట్లు సమానంగా రావడంతో వివాదం నెలకొంది. దీంతో టాస్ వేయగా టీడీపీ మద్దతుదారుడు గెలుపొందాడు. ఈ సందర్భంగా వివాదం నెలకొన దంతో పోలీసులు రంగ ప్ర వేశం చేశారు. సాయం త్రం ఐదు గంటల తర్వా త ఫలితం ప్రకటించారు.

యంబరాంలో ఫిర్యాదు

ఎల్ఎన్ పేట: చింతల బడవంజ ప్రాథమికోన్నత పాఠశాలలో కోరంలేక ఎన్నిక వాయిదా పడినట్టు ఎంఈవో-1 సీహెచ్ మణికుమార్ తెలిపారు. యంబరాం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరో తరగతిలో పది మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఐదుగురి తల్లిదండ్రులు ఎన్నికకు హాజరుకాగా మిగిలిన వారు గైర్హాజ రయ్యారు. అయితే తమ సంతకాలు ఫోర్జరీ చేసి ఎన్నిక నిర్వహించారని తల్లిదండ్రులు పి.విష్ణు, ఎం.బాలకృష్ణ, పి.సుధాకర్, కె.చిన్నారావు, టి.లింగంనాయుడు ఎంఈవో-1కు ఫిర్యాదుచేశారు. హెచ్ఎం ఇచ్చిన జాబితా ప్రాప్తికి పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎంఈవోలు మణికుమార్, చంద్రమౌళి తెలిపారు.

నిలిచిన ఎన్నికలు

నందిగాం: మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కణితివూరు, పెద్దబాణాపురం ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిలిచిపో యాయి. పెద్దబాణాపురంలో కోరం లేక వాయిదా పడిందని, కణితివూరులో ఒక వర్గానికి చెందిన అభ్యర్థులను వేరొక వర్గం వారు దాచిపెట్టడంతో అక్కడ వివాదం చోటుచేసుకొని వాయిదా పడిందని ఎంఈవో జి.నర్సింహులు తెలిపారు. మిగతా చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు పర్యవేక్షించగా.. ఎస్ఐ మహ్మద్ అమీర్‌ఆలీ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **హరిపురం:** ఎంపీపీఎస్ అంబు గాం, ఎంపీయూపీ ఎస్ సువర్ణాపురంలో ఎన్నికలు టై కాగా.. డ్రా తీసి విజేతలను ప్రకటించారు.

● **వజ్రపుకొత్తూరు:** కొత్తపేటలో స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవడం తో పోలీసులు రంగప్రవేశం చేయ డంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి,

● **హిరమండలం:** గొట్ట, చిన్నకొల్లివలస ఆఅర్ కాలనీ పాఠశాలలతో పాటు హిరమం డలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు నిర్వహించ లేదు.

● **సోంపేట:** మండలంలో మొ త్తం 79 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వ హించారు. ఇందులో 13 చోట్ల ఎన్ని కలు నిర్వహించగా, మిగిలిన పాఠ శాలల్లో ఏకగ్రీవమయ్యాయి. ఎంఈ వో ఎస్.జోరాడు పర్యవేక్షించారు.

● **ఎచ్చెర్ల:** చిలకపాలెం, ఇబ్ర హంబాద్ గ్రామాల్లో కోరంలేక ఎన్నిక వాయిదా పడింది. మొత్తం 81 ప్రాథమి క పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పా ఠశాలలు, 15 ఉన్నత పాఠశాలలు, కుప్పిలి లో ఆదర్శ పాఠశాలలు, ఎస్ఎం పురం ఏపీ గురుకుల పాఠశాల, ఎచ్చెర్ల, దుప్పలవలసలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఎంఈవోలు కారు పున్నయ్య, జి.రాజ్‌కిశోర్ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎస్ఎం పురం గురుకుల పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొంటి నర్సింగరావు, ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా కింతలి చలపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి అభినందించారు.

● **పొందూరు:** మండలంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ హవా కొనసాగింది. టీడీపీ సానుభూతిపరులు ఎస్ఎంసీ సభ్యులుగా, ఛైర్మన్లుగా, వైస్ ఛైర్మన్లగా ఎంపికయ్యారు. మండలంలో కూటమి నేతలు హవా కొనసాగగా.. రాపాక గ్రామంలో కూటమి పక్షాలైన టీడీపీ, జనసేన పార్టీల మధ్య పోటీ జరిగింది. చివరకు టీడీపీదే పైచేయి అయింది. లోలుగు ఉన్నత పాఠశాలలో 6వ తరగతికి మాత్రమే ఎన్నిక జరిగింది. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. లోలుగు ప్రాథమిక పాఠశాల తప్పా.. మిగిలిన చోట్ల కూటమి సానుభూతిపరులే ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను సమగ్రశిక్ష అధికారిణి శోభ, ఎంఈవోలు రామరాజు, రాజారావు పర్యవేక్షించారు.

● **రణస్థలం:** మండలంలో స్కూల్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 108 పాఠశాలకు 83 చోట్ల ఏకగీవం కాగా 20 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ఐదు చోట్ల ఎన్నిక వాయిదా పడినట్టు ఎంఈవో త్రినాధరావు తెలిపారు. కాగా 95 చోట్ల కూటమి మద్దతుదారులే గెలుపొందారు. విజేతలను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ అభినందించారు.

● **గార:** మండలంలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్ర శాంతంగా జరిగాయి. 87 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, తొమ్మిది చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ఉప్పరిపేట, దువ్వుపేటలో ఎన్నికలు జరగలేదు. ఎంఈవోలు నక్క రామకృష్ణ, వినోదిని పర్యవేక్షించారు.

● **సరుబుజ్జిలి:** మండలంలో మొత్తం 53 ప్ర భుత్వ పాఠశాలలు ఉండగా, 40 చోట్ల ఏకగ్రీవం కా గా ఏడు చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ఆరు పాఠ శాలల్లో వాయిదా వేసినట్టు ఎంఈవో డి.బాలరాజు తెలిపారు. బుడ్డివలస, బురిడివలస, కొండ్రగూడ, షలంత్రి, సుబ్బపేట, వీరభద్రాపురం, చినకాగితాపల్లి స్కూల్స్‌లో చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహిం చారు. ఇసకలపాలెం, ఫకీర్‌సాహెబ్‌పేట, కొండవలస, పురుషోత్తపురం ప్రాథమిక, పురుషోత్తపురం, పెద్దసవలాపురం జడ్పీ హైస్కూల్స్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.

● **ఇచ్ఛాపురం:** మండల, మున్సిపాల్టీ పరిధిలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం జరిగాయి. మండలంలో మొత్తం 70 పా ఠశాలలు ఉండ గా 27 చోట్ల ఏ కగ్రీవం కాగా, 41 చోట్ల ఎన్నికలు జరిగాం ఖ. బాలకృష్ణాపురంలో కోరం లేక వాయిదా పడగా, ఈదుపు రం (కేడబ్ల్యూ) పాఠశాలలో టై కావడంతో వాయిదా వేసినట్టు ఎంఈ వో అప్పారావు తెలిపారు.

దంతలో వాగ్వాదం

కోటబొమ్మాళి: మండలంలోని 106 పాఠశాలల కు గాను 103 పాఠశాలలకు ఎన్నిక జర గగా రామేశ్వరం, రామయ్యపేట పాఠశాలల్లో కోరం లేకపోవడంతో, దంత లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం వల్ల ఎన్నిక వాయి దా పడింది. ఓ సందర్భంలో వివాదం పెరుగుతుండడంతో ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

● **కంచిలి:** మండలంలో మొత్తం 102 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 94 చోట్ల ఏకగ్రీవం కాగా ఎనిమిది చోట్ల ఎన్నికలు జరిగాయని ఎంఈవో తెలిపారు.

● **బూర్జ:** మండలంలోని గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో కూ టమి బలపరిచిన అభ్యర్థులే ఎన్నికయ్యారు. 63 పాఠశాలల్లో ఎన్నికలు జరగగా 62 పాఠశాలలు ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. చిన్నలంకాం పాఠశాల కోరం వాయి దా వేశారు. ఎంఈవోలు ధనుంయరావు, శ్యామ సుందరరావు పర్యవేక్షించారు.

పెంటవీధిలో గందరగోళం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి పదో వార్డు పెంటవీధి పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. ఇక్కడ ఛైర్మన్ పదవికి పొందర పాపారావు, సీహెచ్ శ్రీనివాస్, బూరగాపు గౌతిమి పోటీ చేశారు. పాపారావుకు 10, శ్రీనివాస్‌కు 10, గౌతిమికి మూడు ఓట్లు పోల వ్వగా.. ఒకటి చెల్లని ఓటు పడింది. దీంతో హెచ్ఎం రేణుకా ఇద్దరికి సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేయాలని సూచించగా అభ్యర్థులు ఒప్పుకోలేదు. కూటమి అభ్యర్థి ఓట్లు లెక్కగట్టి గెలుపు ప్రకటించాలని కోరడంతో గందరగోళం ఏర్పడింది. కొంత సమయం ఘర్షణ ఏర్పడంతో వైసీపీ మద్దతుదారులు మళ్లీ ఎన్నిక నిర్వహించాలని కోరగా, రెండోసారి ఎన్నికలు నిర్వహించారు. దీంతో సీహెచ్ శ్రీనివాస్‌కు 13, పాపారావుకు 10, గౌతమికి ఒక ఓటు పడింది. దీంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని విద్యార్థుల తల్లి దండ్రులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సీఐ విజయానంద్ సిబ్బం దితో చేరుకుని నిరసనకారులను పాఠశాల నుంచి పంపించడంతో గొడవ సద్దుమనిగింది. కాగా పాఠశాలలో తొలిసారి నిర్వహించిన ఎన్నికలో టీడీపీ మద్దతుదారులకు పది, జనసే న మద్దతుదారులకు మూడు ఓట్లు రావడంతో కూటమి తరఫున ఛైర్మన్‌గా ప్రకటిం చాలని అభ్యర్థులు, తల్లిదండ్రులు అడిగినా పట్టించుకోకుండా రెండోసారి ఎన్నికలు నిర్వహించడంపై తల్లిదండ్రులు మండిపడు తున్నారు.



బందోబస్తు వధ్య ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికైన వారిని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రాంజీ, కన్నంనాయుడు తదితరులు అభినందించారు.

● **కవిటి:** మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాలలో కోరం లేక వాయిదా వేసినట్టు ఎంఈవో ధనుంజయ తెలిపారు. మొత్తం 102 పాఠశాలల్లో 89 చోట్ల ఏకగ్రీం కాగా, 12 చోట్ల ఎన్నికలు నిర్వహించారు.

● **జి.సిగడాం:** మండలంలో మొత్తం 62 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించగా, 50 చోట్ల ఏకగ్రీవం కాగా, ఎనిమిది చోట్ల ఎన్నికలు జరిగాయి. కోరం లేక నిద్దాం, సీతంపేట, మెట్టవలస, అద్వానంపేట పాఠశాల ల్లో వాయిదాపడినట్టు ఎంఈవోలు అరసాడ రవి, శ్రీనివాసరావు తెలిపారు.

● **లావేరు:** మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 85 పాఠశాలు ఉండగా, 81 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. గుర్రాలపాలెం, శిగిరికొత్తపల్లి, గురుగుబిల్లి, బెజ్జిపురం-2 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా వేస్తున్నట్టు ఎంఈవోలు లండ ఈశ్వరరావు, మజ్జి మురళీకృష్ణ తెలిపారు.

● **కొత్తూరు:** కడుం జడ్పీ పాఠశాల, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలు ఎన్నిక నిర్వహించడానికి తగిన సభ్యులు లేకపోవడంతో వాయిదా వేశారు.



కోటబొమ్మాళి: పోలీస్ నిఘాలో దంత పాఠశాల



పోలాకి: ఈదులవలసలో గొడవపడిన వ్యక్తులను చెదరగొడుతున్న పోలీసు



ఎచ్చెర్ల: ఎస్ఎం పురం గురుకులం ఛైర్మన్‌ను అభినందిస్తున్న టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి



రణస్థలం: ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

డెంగ్యూతో మహిళ మృతి?



శోభ(ఫైల్)

సోంపేట: పలాసపురం గ్రామానికి చెందిన సంక శోభ(35) డెంగ్యూ జ్వరంతో గురువారం మృతి చెందినట్టు ఆ గ్రామానికి చెందిన బెందాళం బాబూరావు తదితరులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల కిందట జ్వరంబారిన పడిన ఆమె చికిత్స తీసుకుంటుంది. అయితే గురువారం మళ్లీ తీవ్రజ్వరం రావడంతో సోంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఈ క్రమంలో సాయంత్రానికి ఫిట్స్ రావడంతో ఆమె మృతిచెందింది. కాగా శోభకు మన్మథరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై వైద్యాధికారులను సంప్రదించగా ఇటీవల నిర్వహించిన రక్త పరీక్షల్లో డెంగ్యూ లక్షణాలు ఆమెలో కనిపించలేదని, హైపర్‌టెన్షతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పలాస: పలాస-సుమ్మాదేవి రైల్వే స్టేషన్ల మధ్య గురువా రం మధ్యాహ్నం రైలు కింద పడి 50 సంవత్సరాలు వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. గుర్తుతెలియని రైలు ఢీకొన డంతో ప్రమా దం జరిగిందని, మృతుడు ఎవరనేది తెలియ రాలేదని చె ప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్త చేస్తున్నామని చెప్పారు.

దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు

జలుమూరు: మద్యం మత్తులో గురువారం రాత్రి పోలీసు స్టేషన్ ఎదుటకు వ చ్చి పోలీసులను దుర్భాషలాడిన ఎం.దామోదరరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.మధుసూధనరావు తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో వి ధులు నిర్వర్తించిన పోలీసులు తనకు అన్యాయం చేశారని దుర్భాషలాడిన జలు మూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎం.దామోదరరావుపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

రంగస్థల కళాకారుడు చిన్నయాచారి మృతి



చిన్నయాచారి మాస్టారు(ఫైల్)

పొందూరు: ప్రముఖ రంగస్థల కళాకారుడు, సింహాద్రి చిన్నయాచారి మాస్టారు(83) గురువారం ఉదయం వృద్ధాప్య స మస్యలతో కన్నుమూశారు. పొందూరు పట్టణానికి చెందిన చి న్నయాచారి మాస్టారు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ నే కళారంగానికి సేవలందించారు. హార్మోనీయం వ్యాయిద్యకారుడి గానే కాకుండా మేకప్ ఆర్టిస్ట్‌గా సుమారు 65 ఏళ్లపాటు కళారం గానికి సేవలందించారు. ఉపాధ్యాయుడిగా వేలాది మంది విద్యా ర్థులను తీర్చిదిద్దిన ఆయన రంగస్థల రంగంలోనూ వందలాది మందిని తన వారసులుగా తయారు చేశారు. కాగా కొద్ది రోజు లుగా అనారోగ్యానికి గురైన ఆయన పొందూరులోని తన స్వగృ హంలో గురువారం కన్ను మూశారు. చిన్నయాచారిని చివరిచూపు కోసం వందలా ది మంది పూర్వ విద్యార్థులు, నాటకరంగ శిష్యులు తరలివచ్చారు. పొందూరు రంగ స్థల కళాకారుల సంఘ ప్రతినిధులు వి.మురళీమోహన్, బి.శ్రీనివాసం, కె.శాంతారాం, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఇచ్ఛాపురం: నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు తప్పవని ఎంవీఐ అనీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ పరిధి ప్రధాన జంక్షన్‌ల వద్ద స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. పరిమితికి మించి బస్సులో విద్యార్థులు ఉండటం గుర్తించి ఒక ప్రైవేట్ పాఠశాల బస్సుకు రూ.2వేలు జరిమానా విధించారు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, ఎంఈవో అప్పారావు ఉన్నారు.

మెట్టవలసలో తగ్గని డయేరియా

- 71కి చేరిన బాధితుల సంఖ్య




కోళ్ల ఫారం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీపీవో

జి.సిగడాం: మెట్టవల సలో డయేరియా వ్యాప్తి తగ్గడం లేదు. గురువారం మరో తొమ్మిది మంది డయే రియా బారిన పడగా.. బాధి తుల సంఖ్య 71కి చేరింది. గ్రామంలోనే వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు. మరో రెండు రోజుల్లో డయేరియా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. గ్రామంతో పాటు సమీపంలో ఉన్న కోళ్లఫారాన్ని డీపీవో వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈగలు, దోమలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని యాజమాన్యా నికి, స్థానికులకు ఆదేశించారు. ఆయన వెంట ఈవోఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సతీష్, సీహెచ్ శివప్రసాద్, కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు, సర్పంచ్ ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి ఉన్నారు.

వైద్యుల కోసం నిరీక్షణ

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల పడిగాపులు



ఆసుపత్రిలో రోగుల అవస్థలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సీ హెచ్‌సీలో వై ద్యులు ఆలస్యంగా రావడంతో రోగు లు ఇబ్బందులు పడ్డారు. గురువా రం ఉదయం 11 గంటలైనా వైద్యులు రాకపోవడంతో అసహనానికి గురయ్యారు. పేరుకే పెద్దాసు పత్రి అని.. ఇక్కడ సరిపడా వైద్యులు లేక సక్రమంగా సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రికి రోజూ సుమారు 300 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తుంటారు. కాగా.. ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రి సూప రింటెండెంట్.. డాక్టర్ దేవేంద్రరెడ్డి(జనరల్ సర్జన్), డాక్టర్ శిల్ప(పిల్లలు వైద్యులు) మాత్రమే రోగులకు అందుబాటులో ఉంటున్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉండడంతో సేవలు అందించడంలో జాప్యమవుతోందని డాక్టర్ దేవేంద్ర తెలిపారు. ఆస్పత్రికి సరిపడా వైద్యులను నియమించాల్సి ఉందన్నారు.

ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం



నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి: గడచిన ఐదేళ్లలో ప్రజలకు దూరమైన ప్రజా రవాణా సంస్థను ప్రజలకు చేరువ చేస్తూ ప్ర ధాన ఆదాయ వనరుగా ఆర్టీసీని తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం ఎమ్మె ల్యే గొండు శంకర్ అన్నారు. వర్షాకా లంలో నీట మునిగిన ఆర్టీసీ కాంప్లె క్స్‌ను అభివృద్ధి చేసి ప్రజలు మెచ్చే సంస్థగా, జిల్లా ఆర్టీసీని రాష్ట్రంలోనే మేటిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, నీరు నిల్వ లేకుండా చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే నగర కమిషనర్‌కు వివరించామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ను కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చడం ద్వారా ఆదాయం పొందవచ్చునని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య, జిల్లా నాయకులు, కార్మికులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

అరసవల్లి: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సర్పంచ్‌లు, కా ర్యదర్శుల శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో ఎంపీడీవో, అధికారులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బెహరా మనోవికాస కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట: స్థానిక సంతోషిమాత దేవాలయం దరిలో ఉన్న బెహరా మనోవి కాస కేంద్రానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధి కారి ఆర్.సన్యాసినాయుడు గురువారం సందర్శించారు. విభిన్న ప్రతిభా వంతులు ఎదుర్కొంటున్న సమస్య లను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, బెహరా వనోవికా సకేంద్రం యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆక్రమణలు తొలగిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ లో ఉన్న ఆ క్రమణలు తొలగించి, అభివృద్ధి చే స్తామని ఎమ్మెల్యే కూ న రవికుమార్ అన్నా రు. పట్టణానికి చెందిన ఆడిటర్ బుడుమూరు శ్రీనివాసరావు కళాశాలకు విరాళం ఇచ్చిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రారంభించారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ స్వామి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీతా, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, నాయకులు భానోజీరావు, ఢిల్లీశ్వరరావు, చంద్రశేఖర్, సత్యసాయి సేవాసమితి సభ్యులు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

పొందూరు: రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోట్సు పుస్తకాల పంపి ణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సీనియర్ నాయకులు కూన సత్యారావు, కింతలి సర్పంచ్ పైడి రామప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు, నాయకులు రామారావు, అసిరినాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘాలతో సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దంటి కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలన్నీ తమ సొంత నిధులైన పొదుపు నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పు తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకు విల్లింగ్‌తో సంఘ సభ్యులు ఏర్పాటు చేయబోతున్న యూనిట్లకు సబ్సిడీ చేస్తున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో ఏపీఎం కూర్మారావు, ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్, డిపిఎం నారాయణరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: ఈ విద్యా సంవత్సరంలో జరుగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్స్ కోసం 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు డీఈవో తిరుమల చైతన్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాసేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెట్, ప్రాథమి కోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆయా విద్యార్థుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఓసీ, ఓబీసీ విద్యార్థులకు రూ.100 పరీక్ష రుసుం ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాల ని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అల్లెనలో హౌసింగ్ బిల్లుల రీవెరిఫికేషన్

బూర్జ: అల్లెన గ్రామంలో గురువారం హౌసింగ్ బిల్లు రీ వెరిఫికేషన్ చేపట్టారు. ఏఈ లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన బిల్లులను వెరిఫికషన్ చేశామన్నారు. గ్రామంలో ఇళ్లను పరిశీలన చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కొయ్యాం ఫీడర్, ఎస్ఎస్ఆర్ పురం, జరజాం, చినరావుపల్లి, తంగివానిపేట, బట్టువానిపేట, గొలివివాని పేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **ఇచ్ఛాపురం:** విద్యుత్ మరమ్మతులు నిమిత్తం శుక్రవారం కొళిగాం, కీర్తిపురం, పాయితారి, తేలుకుంచి హ రిపురం గ్రామాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యా హ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్న ట్టు ఏఈ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య శిబిరం

ఇచ్ఛాపురం: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. 14 నుంచి 40ఏళ్ల వయసు ఉన్న వారిని పరీక్షించి, మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నరసమ్మ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల పీజీ విద్యార్థుల నాలుగో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. మొత్తం 17 కోర్సుల్లో 391 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 345 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫలితాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 15 రోజుల్లోగా పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చెరువులో చేపలు మృత్యువాత

జి.సిగడాం: చంద్రయ్యపేట ఊర చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. గుర్తుతెలియని వ్యక్తి చెరువులో గుళికలు కలపటం వల్లే చేపలు మృత్యువాత పడ్డాయని బాధితుడు ఆరోపిస్తున్నాడు. గ్రామానికి చెందిన కోరాడ వెంకటేష్ పంచాయతీ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్‌లో వేసిన వేలంపాటలో రూ.40 వేలకు చెరువును పాట పాడుకొని చేపలు సాగు చేస్తున్నాడు. తమపై కక్షకట్టిన ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడని వెంకటేష్ ఆ రోపించాడు. చేపలుమృతి చెందటంతో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం ఉంటుందని లబోదిబోమంటున్నాడు.

బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



షేక్ హసీనా

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన షేక్ హసీనా ఎంపికైంది. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీ ల్లో సత్తాచాటి ఆంధ్రప్రదేశ్ జట్టులో హసీనా ఎంపికైంది. జాతీయస్థాయి పోటీలు బీహార్ రాష్ట్రం గయ పట్టణంలో జరగనున్నాయి. ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హసీనా ప్రతిభపై జిల్లా బీచ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, సీనియర్ క్రీడాకారులు నక్క కృష్ణారావు, సాధు మునసినాయుడు, జి.యమునారాణి, డి.తవిటయ్య తదితరులు అభినందించారు.